# జాజిపందిరి

అలారం కొట్టగానే రామానికి మెలకువ వచ్చింది. క్రితం రాత్రి పొదుపోయే దాకా నిద్దర పట్టలేదు. ఎప్పుడూ రవ్వంత కునుకు పట్టింది. అంతలోనే ఏదో మునిగిపోయినట్టుగా గడియారం యీ గందరగోళం చేసింది.

కళ్ళు తెరవగానే అలవాటుగా 'నారసింహ' అని అనుకుని కుడి అరచేయి వంక చూసుకొని లేవబోతూ ఉండగా ఎదురుగుండా గోడమీద రంగుల వాల్‌పోస్టరు అందమైన అమ్మాయి బొమ్మ 'శ్యామలా సుకుమార్ నాయర్ భరతనాట్యం' అని వ్రాసి ఉంది.

శ్యామల! ఆ పేరు తలచుకోగానే మనస్సులోంచి నిట్టూర్పు వచ్చింది. టెలిఫోన్ మోగింది. ఆలయానికి వెళ్లే స్పెషల్ బస్సు అరగంటలో బయలుదేరుతోంది. సిద్ధంగా ఉండమని అవతలి వ్యక్తి హెచ్చరించాడు.

చకచకా స్నానం సంధ్యా ముగించుకొని రామం బస్సు ఎక్కాడు. యాత్రీకుల నెక్కించుకొని బిగ్గరగా హారన్ మోగించి బస్సు బయలుదేరింది.

అది చాలా అందమైన ఊరు. అంతకంటే అందమైన ఆడవాళ్ళు, వాళ్ళ ఆ కట్టూ బొట్టూ, పెద్ద పెద్ద తలకట్టు- రవివర్మ పెయింటింగ్‌లాగానే వున్నారు. వాళ్ళు రోడ్డుమీద నడచి వెడుతూఉంటే బస్సులో జనం అదేపనిగా వాళ్ళవంక చూస్తూ ఉంటే రామం మాత్రం మౌనంగా అనంతంలోకి చూస్తున్నాడు.

బస్సు ఆలయం ముందు ఆగింది. అది అనంతపద్మనాభస్వామివారి దేవళం. ఆ ఆలయమే ఒక కోట. ఒక చిన్నసైజు నగరం. ముఖద్వారం నుంచీ ధ్వజస్థంభం వరకు దాదాపు ఫర్లాంగుమేర పందిరి, దానిమీద దారిపొడుగునా జాజితీగలు, తీగలమీద ఆకాశంలో నక్షత్రాల్లాగా లెక్కలేనన్ని జాజిపువ్వులు.

జాజిపందిరి చూడగానే శ్యామల గుర్తుకు వచ్చింది. అంతే! మనస్సు జాజిపందిరిలో చిక్కుకునిపోయింది. అడుగు ముందుకు సాగలేదు. శ్యామల ఎలా ఉందో... ఇక్కడ ఒక్క క్షణం ఆగరాదు అనుకుంటూనే అందరితో పాటు తను కూడా ముందుకు నడిచాడు.

ధ్వజస్తంభం దాటి మొదటి ప్రాకారంలోకి వెళ్లాడు. అప్పటికే అక్కడ ఎంతోమంది జనం గుమిగూడి ఉన్నారు. వందలాది జనం ఉన్నా అక్కడ మిగతా

గుళ్ళల్లో, గోపురాల్లో ఉండే గందరగోళం లేదు. అంతా నిశ్శబ్దం. భక్తులందరి చేతుల్లో ఎర్ర కలువపువ్వులూ, ఆడవాళ్ల తలల్లో జాజిపువ్వుల దండలూ.

ఎటు చూసినా జాజిపువ్వులే!!!

రామానికి కోపం వచ్చింది. వీళ్ళందరికీ దూరంగా వెళ్ళిపోవాలని వడివడిగా ముందుకు నడిచాడు.

"ఆగు" అని ఆజ్ఞ వినిపించింది. ఎదురుగుండా వస్తాదులాంటి వ్యక్తి నిలబడ్డాడు.

"రాజావారు పూజ చేస్తున్నారు" అని అన్నాడు. ఒక్క క్షణం అతని వంక చూసి రాము అక్కడే ఆగి రెండడుగులు వెనక్కు వేసాడు.

"రామం" అంటూ ఒక తీయని కంఠం పలికింది- ఛెళ్ళున వెన్నును ఎవరో కొరడాతో కొట్టినట్టు అనిపించింది. ఆ పిలుపూ ఆ కంఠం ఎన్ని జన్మల తరువాతనైనా తనకు గుర్తే.

"రామం" మళ్ళీ అదే పిలుపు. అదే కంఠం. ఒళ్ళంతా కళ్ళు చేసుకుని జనాన్ని కలయజూచాడు రామం. ఆ పిలుపు ఎవరిదా అని పరకాయించి పదే పదే చూచాడు.

"శ్యామలా, ఎక్కడున్నావ్?" అని ఒక మొగగొంతు కేక వేసింది.

రామం మనస్సు కూడా అదే ప్రశ్న వేసింది.

శ్యామలా ఎక్కడున్నావు? ఎక్కడున్నావు శ్యామలా? ఏమో, ఎక్కడుందో?

జనం హడావిడిగా లేచి నిలబడ్డారు. రాజావారు దయచేస్తున్నారు. ఆ దృశ్యం ఇరవయ్యో శతాబ్దాన్ని లిప్త కాలం మరిపించింది. కత్తీ డాలూ పుచ్చుకుని ముందుగా ఒక వ్యక్తి, అతని వెనుక బంగారు వన్నె గల ఒక బక్కపలచటి శరీరం, తెల్ల పట్టు గూడకట్టు, ముఖాన గంధం మీద నల్లటి చుక్కబొట్టు, చూపులో తరతరాల ఠీవి, తలమీద ఎర్రటి పట్టుటోపి, ఆయన వెనుక ఛత్రదారి, అతని వెనుక ఆస్థాన పురోహితులు, వారి వెనుక రక్షక దళం, అందరి వెనుక అండగా దళ నాయకుడు. భయమెరుగని ధైర్యం, క్రౌర్యం ఎరగని గాంభీర్యం, దిగివచ్చిన సదాశివుడిలాగా వున్నాడు ఆ వ్యక్తి.

అందరూ రాజావారికి నమస్కారం చేస్తే ఆయన దైవానికి నమస్కారం చేసి ఆలయం దాటి బయటకు వెళ్ళిపోయాడు. ఇంతవరకూ మూగపోయిన భక్తులు స్వామివారి దర్శనానికి బయలుదేరారు.

స్వామివారో! మూడు గుమ్మాల వెనుక అడ్డంగా పడుకుని వున్నారు. నల్లటి ఆయన ఛాయ మరింత స్వచ్ఛంగా కనిపించటం కోసం కాబోలు, వారి పాదాల

వద్ద ఎఱ్ఱ కమలాలు వుంటే, అంగ అంగానా బారెడు బారెడు జాజి పూవుల దండలు.

స్వామివారి వంటిమీద జాజిపువ్వుల దండలు! ఆడవారి సిగలో జాజిపువ్వుల దండలు! పూజచేసి యిచ్చిన ప్రసాదంలో కలువలతో పాటు జాజిపువ్వుల దండలు!

అర్చకుల మాటల కంటె బిగ్గరగా వినిపిస్తోంది రామానికి ఒకేమాట. 'రామం-రామం'.

కళ్ళు తెరుచుకున్నా, కళ్ళు మూసుకున్నా కనిపించేవి జాజిపువ్వులు!

వెళ్ళిపోవాలి, దూరంగా పారిపోవాలి. పారిపోతున్నంత వేగంగా వచ్చి ఎదురుగుండా వున్న బస్సులో ఎక్కాడు రామం. బస్సు కూడా రామం మనస్సు కంటే వేగంగా పరుగెత్తి అలసినట్టుగా ఆగిపోయింది ఒకచోట. కారణం తెలుసుకుందామని రామం ముందుకు చూసాడు.

బస్సు ఇక ముందుకు వెళ్ళలేదు.

ఎందుకని?

మూడు మహా సాగరాలు కలిసిన చోటు అది.

మూడు మహా మతాలు కలిసిన చోటు అది.

వాటిని దాటుకుంటూ యీ బస్సు యిక ముందుకు వెళ్ళలేదు.

ఉవ్వెత్తుగా ప్రళయ తాండవం చేస్తున్న తూర్పు కెరటం విరిగి ప్రశాంత పశ్చిమ సాగరంలో కలిసిపోతున్న పుణ్యస్థలం అది.

మూడు దిక్కులా మనస్సు ఎవరినో వెదికింది.

తన జ్ఞానబోధతో ప్రపంచానికి ఒక నూతన జ్యోతి చూపించిన వివేకానందుని మందిర మొకదిక్కు!

సర్వ మతాలనీ, సర్వశక్తులనీ తన చిరునవ్వులతో జయించి, సంసార సాగరంలో మధనపడిపోయే అల్పజీవులకు ముక్తిని ప్రసాదించగల ఆ మహాతల్లి కన్యాకుమారి ఆలయం ఇంకొక దిక్కు.

కన్యాకుమారి!!

అవును. అప్పుడు శ్యామల కూడా కన్యాకుమారి.

దృష్టి పరుగెత్తింది. చూపు మరలింది.

పరదాస్య శృంఖలాలలో మగ్గిపోతున్న యీ భారతావనికి తన బోసినోటి చిరునవ్వుతో సర్వ స్వాతంత్ర్యం చేకూర్చిన ఆ యుగపురుషుని స్మారక చిహ్నం ఇంకొక దిక్కు!!!

అవును. ఆనాడు తనూ బానిసే.

ఈ వ్యధ నుంచి పారిపోవాలి! శాంతి కావాలి. ఈ మనస్సుకి శాంతి కావాలి.

వడివడిగా వెళ్ళి స్టీమ్ లాంచి ఎక్కాడు. నిలువుటెత్తు అలలమీద ఎండుటాకుల మీద తూలిపోతూ నావ రవ్వంత దూరంగా సాగి ఆ మహనీయుడు తపస్సు చేసి తరించిన వివేకానంద పర్వతం ఒడ్డున ఆగింది.

చంచల మహాసాగరంలో నిశ్చల పర్వతం. ఇది ఆయన తపోస్థానం. ఎంత చక్కటి ప్రదేశం. సంసార సాగరంలో మథనపడే మానవునికి ముక్తి కావాలంటే నిశ్చలమైన మనస్సు ఉండాలని చెప్పే ప్రత్యక్ష తార్కాణం.

వివేకానందుని మూర్తిలో రామానికి కనిపించింది శ్యామల వదనమే!

ధ్యాన గృహంలో వినిపించింది ఓంకారాన్ని మించిన శ్యామల నామమే!

శాంతి యిక్కడా లేదు నాకు, ఎక్కడా లేదు నాకు అనుకుని రామం బయలుదేరాడు.

అరేబియా సముద్రంలో అస్తమిస్తున్న సూర్యుడికి ఎదురుగా బంగాళా ఖాతంలో నల్లటి మబ్బులు. పొగరెక్కిన సముద్రంలో విలవిలలాడిపోతున్న నావ.

మళ్లీ అదే పిలుపు! మళ్ళీ అదే కంఠం! 'రామం, రామం.'

ఉలిక్కిపడ్డాడు. వివేకమందిరం వంక చూసాడు, కన్యాకుమారి వంక చూసాడు. వాళ్ళిద్దరూ నిశ్శబ్దం! నిశ్చలం!

మళ్లీ అదే పిలుపు! మళ్ళీ అదే కంఠం! 'రామం, రామం.'

నీటివంక చూసాడు. అలాగే చూస్తూ ఉండిపోయాడు.

నీలసాగరంలో నిశ్చలంగా ఉన్న పసికందు శరీరం. ఎవరో నెలల గుడ్డు! అంతకు రవ్వంత దూరంలో ముఖం తెలియని ముద్దరాలి శరీరం!

నీలం చీర! ఎర్ర జాకెట్టు!

విడీ విడని జడలో నలిగిన పోయిన జాజిపువ్వుల దండ!

నిన్ననో మొన్ననో అరవిచ్చుకున్న జాజిపువ్వులు.

రామం పెద్దపెట్టున అరుద్దామనుకున్నాడు. గట్టిగా పిలుద్దామనుకున్నాడు. కాని పూడిపోయిన కంఠంలోంచి వచ్చిన మాటలు,

"పసిపిల్లా! తల్లీ!"

మృత్యువును గురించి జాలిపడకుండా జీవితం ముందుకు సాగిపోయింది. నావ ఒడ్డుకు చేరింది.

ఆ అభాగ్యరాలిని చూద్దామని రామం వెనక్కు తిరిగాడు. కాని అక్కడ వాళ్ళు చూడనివ్వలేదు.

"వెళ్ళిపోండి. ఇక్కడ ఉండటానికి నీల్లేదు" అంటూ బయటకు పంపించి వేసారు.

బ్రతికి ఉన్నవాళ్లకు అనుక్షణం హడావిడే- ప్రతిక్షణం తొందరే.

'గుడి తెరుస్తున్నారు! గుడి తెరుస్తున్నారు' అంటూ జనం హడావిడిగా ముందుకు వెళుతున్నారు. రామం కూడా ముందుకు నడిచాడు. గుడిలో అడుగుపెట్టాడు.

మానవుల జన్మలు మారినా కాలం యుగాలు గడిచినా మారక నిలిచింది ఆ మహాతల్లి చిరునవ్వేగా!

ఆవిడ చిద్విలాసం కన్నా రామం మనస్సులో కనిపించింది నీళ్ళమీద తేలిపోతున్న తెల్లటి జాజిపువ్వుల దండ!

ఎవరిదో వాడిపోయిన బ్రతుకు.

కసిరినట్టుగా విసుగ్గా అర్చకుడు తన చేతిలో పెడుతున్న ప్రసాదం వంక చూసుకున్నాడు రామం- పసుపు, కుంకం, జాజిపువ్వుల దండ. పాముని చూసినంత భయం వేసింది. క్షణంలో గుడిదాటి బయటకు వచ్చాడు. బిచ్చమడిగిన ముష్టివాడి జోలెలో జాజిపువ్వుల దండ పడవేసాడు.

బస్సు హారను విని కన్నెత్తి చూసాడు. రెండంగల్లో బస్సు ఎక్కాడు.

"మద్రాసుకు టిక్కెట్టు యివ్వండి" అని అన్నాడు.

మదరాసు! ఇరవై సంవత్సరాల తరువాత తను మళ్ళీ మదరాసు వెళుతున్నాడు.

ఎన్నడూ మరువలేని మధురస్మృతులు సృష్టించిన మదరాసు వెడుతున్నాడు.

ఒక్కరాత్రిలో తనను వెయ్యి సంవత్సరాలు ముసలివాడిని చేసిన మదరాసు వెడుతున్నాడు.

ఇరవై సంవత్సరాల క్రితం కలలు కనే వయస్సులో తను... ఆనాడు... చిన్ననాటి చెలిని, తనతో పసితనంలో చెమ్మచక్కలు ఆడిన బాల్యసఖిని చూడడానికి అనేక సంవత్సరాల తరువాత వెడుతున్నాడు.

చిన్ననాడు కలిసి మెలిసి ఆడుకున్నారు. ఆత్మీయులుగా మెలిగారు. నాన్నగారి ఉద్యోగం వల్ల తను ఇంకొక ఊరు వెళ్ళిపోయాడు. మనుష్యులు దూరమైనా మనస్సులు దగ్గరగానే ఉండిపోయాయి.

చదువులకి దూర ప్రాంతం వెళ్ళిపోయినా శ్యామల ఎప్పుడూ మనస్సులో మసలేది. దైవం అనుకూలించాడు. మంచిరోజు వచ్చింది. మళ్ళీ యీనాటికి చిన్ననాటి చెలిని చూసే అదృష్టం కలిగింది. ఆ మధురమూర్తిని తలచుకుంటూ ఊహల్లో తేలిపోతూ అలా అలా నడిచి వచ్చాడు. ఎంత దూరం నడిచాడో తనకి తెలియదు. తెలిసినదల్లా అది చాలా అందమైన తోట అనీ, అందులో వందల రకాల పువ్వుల మధ్య దర్పంగా కనబడుతున్న జాజిపందిరి. ఆ జాజిపందిరితో పాటు ప్రపంచానికే కొత్త అందం తెచ్చి పెడుతున్న అపురూప సౌందర్యరాశి శ్యామల. తనని చూసి గుర్తుపట్టి కూడా చిరునవ్వుతో ఆ కొంటె కోణంగి అడిగిన ప్రశ్న,

"ఎవరు మీరు?"

తను కూడా కొంటెగానే సమాధానం చెప్పాడు. "కథానాయకుడిని."

"ఎందుకు వచ్చారు మా తోటలోకి?"

"స్వర్గమిదేనని భ్రమపడి..."

కోపం తెచ్చుకుంటున్నట్టు నటిస్తూ, ఆత్మీయతనీ, ఆనందాన్నీ దాచేసుకొనటానికి ప్రయత్నం చేస్తూ-

"మా నాన్నగారు చూస్తే ఇది మీ పాలిటి నరకం అవుతుందేమో?"

"నీలాంటి దేవతలున్న చోట నరకం ఎన్నటికీ కాదు శ్యామలా."

చిలిపితనం మాని శ్యామల అడిగిన ప్రశ్న-

"నేను గుర్తు ఉన్నానా రామం?"

రామం చెప్పిన సమాధానం- "నా హృదయాన్ని అడిగిచూడు."

అది జన్మజన్మలకూ శుభసమయం. యుగయుగాలకూ అదే సార్థకం. అంతులేని ఆనందాలకు ఆ క్షణమే నాంది.

రోజులు గడిచాయి. నెలలు గడిచాయి. వారిద్దరి మధ్యా ప్రేమ హిమాలయాల కన్నా ఉన్నతంగా పెరిగింది.

కాని పెద్దలు చెప్పిన మాట అబద్ధం కాదు. 'పెరుగుట విరుగుట కొరకే.'

మల్లెతోటలో పాములున్నాయి- చిలికిన అమృతంలో గరళముంది. ఓర్వలేనివారి హృదయాలలో ద్వేషముంది.

ఒక చీకటి వేళలో చిన్నది తనతో అన్నది- "మనం ఇక్కడ సుఖపడలేము రామం! మా నాన్న మన వివాహానికి ఒప్పుకోవటం లేదు. ఐశ్వర్యానికి ఆయన బానిస. ఆయనకు కావలసినదల్లా ఆస్తులూ అంతస్తులే కాని, ఆత్మీయతా అనురాగం కాదు.

"ఏం చేద్దాం శ్యామలా?"

"దూరంగా పారిపోదాం. ఎవరూ తెలియని చోట ఏకమవుదాం. రేపే ప్రయాణం. అర్ధరాత్రి వేళ యీ జాజిపందిరి దగ్గర కలుసుకుందాం. నాన్న వాళ్ళూలేని యీ సమయంలో మనం ఊరు దాటిపోదాం. మరిచిపోకు. నాకోసం ఎదురుచూడు. రేపు అర్ధరాత్రివేళ యీ జాజిపందిరి దగ్గరే కలుసుకుందాం. కలిసి కష్టాలనుంచీ దూరంగా పారిపోదాం."

మరునాడు రాత్రి వచ్చింది. అంతులేని చీకటి తెచ్చింది. క్షణమొక యుగంగా గడిచింది రామానికి. తెల్లవారే తరుణంలో పందిరిని ఉన్న పువ్వే రామాన్ని వెక్కిరించింది.

ఎందుకు?

ఆడదాని మాట నమ్మినందుకు.

అహంభావం వచ్చింది! ఆవేశం వచ్చింది! అంతులేని దుఃఖం వచ్చింది! పట్టరాని కోపం వచ్చింది! కాని శ్యామల మాత్రం ఆ రాత్రి జాజిపందిరి దగ్గరకు రాలేదు... ఎన్ని రాత్రులు వేచియున్నా శ్యామల మళ్ళీ కనిపించలేదు.

మనస్సు రాయి చేసికొని మద్రాసు తిరిగి ఎన్నడూ రాకూడదని నిశ్చయం చేసుకొని దూరంగా, చాలా దూరంగా వెళ్ళిపోయాడు. ఫారెస్ట్ ఆఫీసరుగా మానవులకి దూరంగా యింతకాలం అజ్ఞాతవాసమే చేసాడు.

కాలమే మనస్సు వేసిన బొమ్మ చెరిపివేసిందని, యీ ఇరవై వసంతాలలో ఆ చిత్తరువే హృదయం నుంచి చెరిగిపోయిందని తను అపోహపడ్డాడు.

అవును. అది వట్టి అపోహే!!

ఉద్యోగ ధర్మంగా ఇన్నాళ్ళకి మళ్ళీ యీ సీమకు రావలసిన పని కలిగింది.

నివురు కప్పిన నిప్పు రాజుకుంది.

ఈనాడు మనస్సులో ఆలోచన ఒకటే! ఆలాపన ఒకటే!!

శ్యామలని చూడాలి! శ్యామలని ఎలాగైనా ఒక్కసారి కలుసుకోవాలి!!

ఈ ఇరవై సంవత్సరాలలో చరిత్రే మారిపోయింది. మదరాసు మరీ మారిపోయింది.

ఆనాడు కలలు కన్న భూలోక స్వర్గాన్ని వెతుక్కుంటూ ఆ సుందర ఉద్యానవనంలో ఆకాశమంత జాజిపందిరి ఉన్న ఆ భవంతి కోసం వెతుక్కుంటూ వెళ్ళాడు. కన్నుల ఎదుట కనబడ్డది చూడగానే మనస్సు గద్గదమయింది. ఆ సిరిసంపదలు ఈనాడు అక్కడ లేవు. ఆ తోట లేదు. ఆ అందం లేదు.

YOP-9

అలవైకుంఠపురంలో శ్రీలక్ష్మి లేదు. పడిపోయిన, ఎండిపోయిన చెట్లమధ్య భీభత్సంగా పెరిగిన రక్కిస పొదలమధ్య యింకా మిగిలివున్న జాజిపందిరి చెదురు చెదురుగా పూసే పువ్వులు, రాలిపోతున్న ఆకులు.

ఈ భయంకర నిశ్శబ్దం మధ్య మళ్ళీ అదే పిలుపు- మళ్ళీ అదే కంఠం, "రామం!"

ఆ పిలుపును వెతుక్కుంటూ తామిద్దరూ జీవన వసంతాలలో తొలినాడు కలిసిన చోటు ఊహించుకుంటూ ముందుకు నడిచాడు.

అవును. శ్యామల అక్కడే నిలబడి వుంది.

ఎదురుచూస్తూ నిలబడి వుంది నిశ్చలంగా.

"శ్యామలా! శ్యామలా!" అంటూ పిలుస్తూ ముందుకు అడుగు వేసాడు.

ఆ సుందరి చలువరాతి పాదాల క్రింద, కన్నీటి తెరల నుంచి అస్పష్టంగా కనిపించిన మాటలు-

"కుమారి శ్యామల- జననం..." రెండో వాక్యం చదవలేకపోయాడు.

"మరణం.... వైశాఖ పూర్ణిమ."

స్పృహకు దూరమౌతున్న రామానికి ఏదో లోకం నుంచి అస్పష్టంగా వినిపిస్తున్న అదే పిలుపు- అదే కంఠం-

"రామం, రామం!"